క్లుప్తంగా

ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రోత్సాహం

బెల్లంపల్లి: ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి అర్చన ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మ్యాట్రిక్స్ ఫామ్ ఆయిల్ కంపెనీ నర్సరీని ఏర్పాటు చేసిందని, అవసరమైన రైతులు ఆయిల్ పామ్ మొక్కలు పొందవచ్చని తెలిపారు. ఈ సాగు చేసే రైతులకు మొదటి, నాలుగేళ్ల వరకు ఒక్కో ఎకరాకు అంతరపంట సాగు, కలుపుతీత తదితర నిర్వహణకు రూ.4,200 ఆర్థికసాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఒక్కో ఆయిల్‌పామ్ మొక్కను సబ్సిడీపై రూ.20కే ఇస్తోందని వెల్లడించారు. ఎకరాకు గరిష్టంగా 57 మొక్కలు నాటుకోవాలని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతంతో డ్రిప్ సౌకర్యం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఇందులో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/భీమిని: రేచిని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జాన్ తెలిపారు. మరమ్మతు కారణంగా రేచిని, అన్నారం, బారేపల్లి, గంపలపల్లి, అచ్చలాపూర్, కొమ్ముగూడం, గోపాల్‌నగర్, గోపాల్‌రావుపేట గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- హాజీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని హాజీపూర్, టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్, ధర్మారం గ్రామాల్లో శనివారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.
- అందుగులపేట సబ్‌స్టేషన్ పరిధి మందమర్రి మున్సిపాలిటీ, అందుగులపేట, పులిమడుగు, బొక్కలగుట్టలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఇంజినీర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.
- బెల్లంపల్లి శివారు 33 కేవీ శివాలయం ఫీడర్‌పై పీఎంఐ లైన్ మెయింటనెన్స్ పనుల కారణంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధాకుర్ధు, బుధాకలాన్, చంద్రవెల్లి, చాకేపల్లి, లంబాడితండా, గురిజాల, రంగపేట, దుగినేపల్లి, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి గ్రామాల్లో శనివారం సరఫరా ఉండదని బెల్లంపల్లి రూరల్ ఏఈ రామమనోహర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.
- కన్నెపల్లి మండలం జన్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదని భీమిని ఏఈ రాజనర్సు తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్

చెన్నూర్: పట్టణంలోని బందారి రాజేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూర్, కోటపల్లి మండలాలకు చెందిన 20 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బందారి లక్ష్మణ్ తెలిపారు. వైద్యనిపుణుడు పి.మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మేస్తున్న చెట్లపొదలు



దండేపల్లి: మండలంలోని లింగాపూర్ నుంచి దుబ్బగూడ వెళ్లేదారిలో ప్రాథమిక పాఠశాల సమీపంలో సీసీ రోడ్డును చెట్లపొదలు కమ్మేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్ల పొదలతో దారి మూసుకుపోయేలా ఉంది. పంచాయతీ అధికారులు చెట్లపొదలు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా భవనం



చెన్నూర్‌రూరల్: మండలంలోని కమ్మరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేక మూతపడింది. దీంతో పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. ఏళ్లుగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా ఉంది. అధికారులు వెంటనే పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్పందించారు.. తొలగించారు



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి పెట్రోల్‌బంక్ వద్ద స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకుంది. 'చెట్టును తలపిస్తున్న విద్యుత్ స్తంభం'శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు. స్తంభానికి అల్లుకుని ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, ఆవులు ప్రమాదాల బారిన పడకుండా నివారించారు.

సాక్షి స్పందన



పిచ్చిమొక్కలు తొలగింపు

చెన్నూర్: 'మున్సిపల్ ఆఫీస్ ముందే పిచ్చిమొక్కలు'శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెరిగిన పిచ్చిమొక్కలను సిబ్బందితో తొలగింపజేసి శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ తదితరులు ఉన్నారు.

రహదారి ధ్వంసం



ధ్వంసమైన భీమారంలోని పాత పోస్టాఫీస్ సీసీ రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- నిలుస్తున్న వర్షపు నీరు
- రాకపోకలకు ఇబ్బంది
- భీమారంలో సీసీ రోడ్ల దుస్థితి

భీమారం: మండల కేంద్రంలో నిర్మించిన సీసీ రోడ్లలో చాలావరకు ధ్వంసమయ్యాయి. అడుగడుగునా గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచి ఉంటోంది. రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జైపూర్ మండలంలో ఉన్నప్పుడే భీమారంలోని ప్రధాన వీధుల్లో అప్పటి ప్రభుత్వం సీసీ రోడ్లు నిర్మించింది. నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ప్రస్తుతం చాలావరకు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని 11 పంచాయతీల్లో పెద్దది భీమారం ఒక్కటే. ఇక్కడ జనాభా దాదాపు 10 వేల వరకు ఉంటుంది. బస్టాండ్ నుంచి పాత పోస్టాఫీస్, నేషనల్ హైవే రోడ్డు నుంచి లంబడీతాండా, పద్మశాలి వీధులు చాలావరకు దెబ్బతిన్నాయి. జాతీయ రహదారి నుంచి పాతబ్యాంకు మీదుగా లంబాడీతండా, ఎస్సీకాలనీ వరకు నిర్మించిన రోడ్డు మరీ అధ్వానంగా ఉంది. గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలవడంతో అనేకమంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దపల్లి ఎంపీగా పనిచేసిన సుగుణ కుమారి హయాంలో పెద్దఎత్తున సీసీ రోడ్లు నిర్మించారు. వాటిలో ఇప్పటికీ కొన్ని చెక్కుచెదరలేదు. ఆ తర్వాత నిర్మించిన రోడ్లు చాలావరకు దెబ్బతిన్నాయి. నేషనల్ హైవే నుంచి లక్ష్మీదేవర ఆలయం మార్గంలో నిర్మించిన సీసీ రోడ్డు ధ్వంసమయ్యాయి. గత సంవత్సరం సీసీ రోడ్లు నిర్మించారు.



లంబాడీతండాలోని సీసీ రోడ్డుపై గుంతలు

మరమ్మతు చేపట్టాలి



మండల కేంద్రంలో చాలావరకు సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. రాకపోకలు ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం దెబ్బతిన్న సీసీ రోడ్లకు మరమ్మతు చేపట్టాలి.

– బానోత్ శ్రీనివాస్‌నాయక్, భీమారం

ఉన్నతాధికారుల దృష్టికి..



మండల కేంద్రంలోని వివిధ వీధుల్లోని సీసీ రోడ్ల మరమ్మతు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రోడ్లు నిర్మించి చాలా ఏళ్లు కావడం వల్ల దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను పరిశీలించాం.

– మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

యోగా, ధ్యానంతో మానసిక పరిపక్వత

మంచిర్యాలఅర్బన్: యోగా, ధ్యానంతో మానసిక పరిపక్వత పొందవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అనిత అన్నారు. శుక్రవారం మంచిర్యాల కేజీబీవీలో ప్రపంచ మానసిక ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు సునీల్ మాట్లాడుతూ యువత ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆధునిక జీవనశైలి, సాంకేతికత ప్రభావం, పోటీ ప్రపంచం, తదితర ఒత్తిళ్ల కారణంగా యువతలో మానసిక ఆరోగ్యం క్షీణిస్తోందని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబరు 14416 ద్వారా చికిత్స, కౌన్సెలింగ్ పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నంబరు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాలలో ఎనీమియాపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్, వైద్యులు ప్రసాద్, శివప్రతాప్, నజియా, లింగారెడ్డి, లక్ష్మణస్వామి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి

మంచిర్యాలఅర్బన్: డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజులను భారీగా పెంచారని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై రూ.1910 ఫీజుల భారం పడుతుందని తెలిపారు. పెంచిన ఫీజుల తగ్గించని పక్షంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు వంశీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం బీసీలు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

బెల్లంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు దక్కించుకోవడానికి బీసీలు ఐక్యం కావాలని బెల్లంపల్లి బీసీ సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో బీసీల 42 శాతం రిజర్వేషన్లకు ప్రతి రాజకీయ పార్టీ సహకరించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన కల్పించిన రిజర్వేషన్లను కొందరు వ్యతిరేకించడం సరికాదన్నారు. బీసీ ఉద్యమం అనేది ఏ రాజకీయ పార్టీకి, ఏ వర్గానికి, ఏ కులానికి వ్యతిరేకం కాదన్నారు. మేమెంతో మా వాటా అంత అనే నినాదంతో బీసీలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని, అంతవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు ఇ.సువర్ణ, మద్దెల శ్రీనివాస్, వేల్పుల రాజేందర్, తొంగల రాజేశం, గైని శంకర్, తొంగల శ్రీనివాస్, నరసింహులు పాల్గొన్నారు.


'కేంద్రం అడ్డుకోవడం అన్యాయం'

జైపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకున్నప్పటికీ కేంద్రం కుట్రపూరితంగా అడ్డుకోవడం అన్యాయమని బహుజన సంఘా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మార్త మారుతి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ దాన్ని ఆమోదించకుండా అడ్డుకుందని పేర్కొన్నారు.

కరెంటు బిల్లు కడతావా..తాళం వేయాలా

- వృద్ధురాలికి బెదిరింపు
- లైన్‌మెన్, జేఎల్‌ఎం వేధింపులతో రూ.5 వేలు చెల్లింపు
- వేరేవారి పేరిట మీటర్ బిగింపు
- విద్యుత్ ఏఈకి ఫిర్యాదు

జన్నారం: కరెంటు బిల్లు కడతావా..ఇంటికి తాళం వేయాలా అని విద్యుత్ సిబ్బంది బెదిరిస్తున్నారని జన్నారం మండలం కిష్టాపూర్‌కు చెందిన వృద్ధురాలు దుర్గం బుచ్చక్క వాపోయింది. శుక్రవారం ఆమె విలేకరుల ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. ఒంటరిగా ఉన్న తాను గతేడాది మీటరు కోసం దరఖాస్తు చేసుకున్నాను. చర్లపల్లి గ్రామానికి చెందిన దండవేని విజయ పేరిట మీటరు బిగించారు. వద్దని వారించిన వినలేదు. అందుకే బిల్లు కట్టలేదని, దీంతో లైన్‌మెన్, జేఎల్‌ఎంలు వారం రోజులుగా వేధిస్తున్నారు. మెడలు పట్టి తోశారు. ఇంటికి తాళం వేస్తామని బెదిరించారు. భయంతో వేరే వారి వద్ద అప్పు తెచ్చి రూ.5 వేలు కట్టాను. బెదిరించి తన వద్ద డబ్బులు కట్టించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేసినట్లు బుచ్చక్క తెలిపారు.



గోడు వెళ్లబోసుకుంటున్న దుర్గం బుచ్చక్క

'బీఆర్‌ఎస్ నేతల డ్రామాలు నమ్మరు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: అప్పుడే బాగుండే అంటూ ఇంటింటికీ కార్డులు పట్టుకుని తిరిగే బీఆర్‌ఎస్ నేతల డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. చెన్నూర్ నడిబొడ్డున ఉన్న తహసీల్దార్, నీటిపారుదల శాఖ కార్యాలయాలు కూల్చేసి కూరగాయాల మార్కెట్ నిర్మించారని తెలిపారు. డబుల్ బెడ్రూం పేరుతో జగన్నాధుల కుంటను ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఆఫీస్‌లను కూల్చేశారన్నారు. అప్పుడే ఏం బాగుందో చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, చెన్నూరి రాజేశ్, పెండ్యాల శ్రీకాంత్, ఖలీల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సౌత్ క్రాస్‌కట్ గని భూ కబ్జాను ఆపాలి



జీఎం రాధాకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి సౌత్ క్రాస్‌కట్ గనికి సంబంధించిన ఖాళీ భూమి కబ్జా కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్.నర్సయ్య తెలిపారు. శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్ క్రాస్‌కట్ గని మూసివేతకు గురయ్యాక ఇరువురు సామాజిక వర్గాలకు చెందిన దేవాలయాల నిర్మాణాలకు ఖాళీ స్థలాన్ని కేటాయించారన్నారు. ప్రస్తుతం ఓ సామాజిక వర్గానికి చెందిన శ్రేణులు మిగిలి ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి సిద్ధపడటం శోచనీయమన్నారు. సింగరేణి అధికారులు భూ కబ్జా కట్టడికి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, ఏఐటీయూసీ సింగరేణి విభాగం బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రత్నం రాజం, ఐలయ్య, బి.తిలక్‌అంబేద్కర్, కె.రాజేష్, రమేశ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

మరమ్మతు త్వరగా చేయాలి



శ్రీనివాసులును సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో యంత్రాల మరమ్మతు త్వరగా చేయాలని కార్పొరేట్ జీఎం(వర్క్ షాప్, ఎనర్జీ మేనేజ్మెంట్) కె.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లో పర్యటించారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై చర్చించారు. పంప్‌మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు త్వరగా చేయాలన్నారు. కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఉద్యోగులు వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించి పని చేయాలన్నారు. మొదటిసారి ఇక్కడికి వచ్చిన సందర్భంగా ఆయన్ను ఏరియా అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం కుర్మ రాజేందర్, ఎస్‌వోటు జీఎం ఎస్.సత్యనారాయణ, ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఏరియా ఇంజినీర్ రమణారావు, డీజీఎంలు రవీందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'భూకబ్జాదారులకు అండగా నిలవడం సరికాదు'

బెల్లంపల్లి: భూ అక్రమార్కులకు ఎమ్మెల్యే అండగా నిలవడం సరికాదని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నీరటి రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్ము రాజయ్య అన్నారు. శుక్రవారం కబ్జాకు గురైన బెల్లంపల్లి సౌత్‌క్రాస్‌కట్ గని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున రూ.కోట్లు విలువచేసే సింగరేణి భూమిపై కబ్జాదారులు కన్నేశారని విమర్శించారు. ఈపాటికే సౌత్‌క్రాస్‌కట్ గని లీజుభూమిని కబ్జా చేసి అమ్మకాలు సాగించి రూ.కోట్లు సంపాదించారని, మిగిలిన భూమిని ఆక్రమించేందుకు పన్నాగం పన్నారని తెలిపారు. సింగరేణి ఖాళీస్థలాలు పరాధీనం కాకముందే ఇళ్లు లేని పేదలు, రిటైర్డు, కాంట్రాక్టు కార్మికులు, కార్మికసంఘాల కార్యాలయాల నిర్వహణకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ, సింగరేణి భూముల ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు జైపాల్ సింగ్, శ్రేణులు జి.శ్రీహరి, ఎల్తూరి శంకర్, బస్తీవాసులు సదానందం, కిశోర్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా సత్యనారాయణ



సత్యనారాయణ

మందమర్రిరూరల్: ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా కేకే-ఒసీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహించే యేకుల సత్యనారాయణ నియమితులయ్యారు. యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ శుక్రవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనకు పదవి అప్పగించిన జనక్ ప్రసాద్‌తోపాటు యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

కాసిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎం.లావణ్య, పి.అక్షితలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబురావు తెలిపారు. ఈ నెల 10నుంచి 12వరకు సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శంకర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య, పీడీ, సిబ్బంది వారిని అభినందించారు.

నేడు ధన ధాన్య కృషి యోజన ప్రారంభం

బెల్లంపల్లి: రైతాంగానికి దోహదపడే ధన ధాన్య కృషి యోజన, పప్పుధాన్యాల స్వావలంబన మిషన్ కార్యక్రమం శనివారం ప్రారంభం కానున్నటు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ప్రసూన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రారంభిస్తారని, బెల్లంపల్లి కేవీకేలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.